# మంటల్లోంచి మల్లెపొదలు

ఆదూరి వెంకట సీతారామమూర్తి

"మమ్మీ ! దయ్యాలంటే ఏంటి మమ్మీ?"

అయిదేళ్ళ కూతురు నిర్మల అడిగిన ప్రశ్నకి పుస్తకం చదువుతూ మంచంమీద పడుకున్న శ్యామల ఉలిక్కిపడింది-

"ఇప్పు డా మాట లెందుకమ్మా? చిన్నపిల్లవు-నువ్వు అలాంటివి అడగకూడదు" అంది-పక్కనే పడుకున్న కూతురిమీద చెయ్యి వేస్తూ-

"మరి శ్మశాన మంటేనో...?

"చెప్పేనా అలాంటివి చిన్నపిల్లలు అడగకూడదనీ?" ఈ మారు విసుక్కుంది.

"ఫో మమ్మీను వ్వెప్పుడూ ఇంతే. ఏమడిగినా చెప్పవ్. పైగా కోప్పడతావు కూడా" అంది నిర్మల.

"రాత్రులు ఇలాంటి విషయాలు మాట్లాడుకోకూడదని ఎన్నిసార్లు చెప్పాను మరి !"

"రాత్రులు అడగకపోతే పగలు నువ్వు నాకు ఖాళీగా దొరుకుతావేంటి మమ్మీ?"

మూతిని సున్నాలా చుట్టి తల్లివైపు వీపు పెట్టి అటు తిరిగి పడుకుంది నిర్మల.

ఈమారు శ్యామలకి నవ్వొచ్చింది. నిజమే-తెల్లారిందంటే తనకు హడావుడే ! అయిదు గంటలకు లేచినా ఆఫీసు టైమ్ వరకూ ఊపిరి సలపనంత పని ఉంటుంది.

వంట పని; ఆయనను నిద్రలేపి కావలసినవి చూడటం; నిర్మల హోమ్ వర్క్ చేసిందో లేదో కనుక్కుని, దాన్ని స్కూలుకి తయారుచేయడం. పనివాళ్ళు ఉన్నా కొన్ని పనులు తానే చేసుకోవా లనుకుంటుంది.

"నీ కెందుకమ్మా ఈ యాతనంతా ! నువ్వు ఉద్యోగం చెయ్యకపోతే గడవని ఇల్లా ఇది ! హాయిగా ఉన్నదీ ఖర్చు పెడుతూ కూర్చోక ను వ్వెందుకమ్మా శ్రమపడటం?" అంటారు మామగారు.

నిజమే. ఆయన రాజకీయాల్లో తిరిగి ఏ పదవులూ సాధించకపోయినా రెండు తరాలకు సరిపడా ఆస్తిని సంపాదించారు. కొడుకుని బిజినెస్ మాగ్నెట్‌ని చేశారు. తను ఉద్యోగం చేసి సంపాదించవలసిన అవసరం లేదు. కానీ ఎంతసేపూ ఇంట్లో నాలుగు గోడల మధ్యే గడపాలంటే తనకు గిట్టదు. అందుచేతే డబ్బు అవసరం లేకపోయినా కాలక్షేపానికి ఉద్యోగం చేస్తోంది.

అయితే తను ఉద్యోగం చేయడంవల్ల దేశంలో ఉద్యోగం అవసరం ఉన్న మరొకరికి ఆ అవకాశం లేకుండా పోతోంది-అది మాత్రం నిజమే అనిపిస్తుంది ఆలోచిస్తే.

ఎవరి మాట ఎలా ఉన్నా తను ఉద్యోగం చేయడంవల్ల తన నిర్మల తల్లి ప్రేమకూ, అప్యాయతకూ దూరమౌతూందా అనే అనుమాన మొచ్చింది శ్యామలకు మొదటిసారిగా.

తల్లి ఏం మాట్లాడకపోవడం చూసి నిర్మలే అంది:

"తాతయ్యే నయం. ఎంచక్కా కథలూ, కబుర్లూ చెబుతారు. నువ్వూ డాడీ ఎప్పుడూ ఇంతే. నీ జట్టు పీస్ కొట్టేస్తాలే !"

ఈ మారు శ్యామల నిర్మలని తనవైపు తిప్పుకుని అప్యాయంగా దగ్గరగా తీసుకుంది.

"పోన్లే. అలాగే చేద్దూగాని-మరీ... ని న్నెవరు అడగమన్నారూ? అటువంటి కబుర్లు చెప్పుకుంటే చిన్నపిల్లలు రాత్రులు భయపడతారన్న మాట ! అందుకే చెప్పలేదు. సరా?" అంటూ బుజ్జగించింది.

నిర్మల ఏం మాట్లాడకపోవడంతో నెమ్మదిగా చదువుతూన్న పుస్తకంలో లీనమైపోయింది శ్యామల.

"మరీ...విన్ను అలా చెప్పేదేం? దయ్యాలు మనుమల్ని పట్టుకుని తినేస్తాయా?"

శ్యామల ఏం మాట్లాడకపోడంతో-"ఏంటి మమ్మీ నిజమేనా?" రెట్టించింది నిర్మల.

"ఆఁ" యాదాలాపంగా అనేసింది శ్యామల.

** ** **

సవర్లో ఉన్న మినిస్టర్లా పవర్‌ఫుల్‌గా కూర్చొని వాళ్ళు చెప్పేది వింటూ మధ్య మధ్యలో మీసాలు మెలేస్తున్నారు గోపాల్రావుగారు.

గోపాల్రావుగా రంటే మినిస్టర్లు కూడా జడుస్తారు. అతనికి రాజకీయ పలుకుబడి బోల్డంత ఉంది. ఓటర్ల పల్సు తెలిసినవాడిగా అతనికి గొప్ప గుర్తింపు ఉంది. ఒకప్పుడు వార్డు కౌన్సిలర్‌గా కూడా చేశాడు. మరొకప్పుడు ఎమ్మెల్యే పదవికి పోటీ చేసి కాస్తలో తప్పిపోయేడు.

కానీ పదవి లేకపోయినా ప్రజలనుంచి గానీ, రాజకీయాలనుంచి గానీ ఆయన తప్పుకోలేదు. అందుచేతే ఆయన దగ్గరకు రోజూ ఎవరో ఒకరు ఎందుకో ఒకందుకు వస్తూనే ఉంటారు.

ఇప్పు డాయన ముందు ఓ పాతికమంది జనం ఉన్నారు. వాళ్ళు చెప్పింది సావధానంగా విన్నా రాయన. విని; ఓ క్షణం ఆలోచించి-"అయితే ఏమంటారూ? దాన్ని అక్కణ్ణించి మార్చేయకుండా చూడాలంటారు. అంతేనా?" అన్నారు.


"ఔను బాబూ" అన్నా రంతా ఏకకంఠంతో.

"దానివల్ల మీ కేంటి లాభం?"

"లాభమే ముంటుందండయ్యా. ఊరు పెరగనప్పుడు వూరికి దూరంగా వుండేది సొసేనం. అక్కడ్నే మా తాతలూ, తండ్రులూ బూమిలో కలిసేరు. ఇప్పు డది మార్చేయా లనుకుంటోందట పెబుత్వం. అది మాకు నచ్చదు" అన్నా రొకరు.

"అలా చేయడంవల్ల మా తాత ముత్తాతలకే కాదు, మా మతానికి కూడా అపకారం చేసినట్టే అవుతుంది. అంచేత మా మొప్పుకోం" అన్నా రింకొకరు.

"మొన్నటికి మొన్న పెలమోళ్ళ తాతని తీసుకెళ్తే అడ్డేసేరు. ఈ రోజు గున్నయ్య గుప్తాగారు..."



"అంతే బాబూ !"

"మరి దాని గురించి ఈ ఊళ్ళో చర్చిస్తే కుదరదు. ఇప్పటికే మున్సిపాలిటీ ఓ నిర్ణయం తీసేసుకుంది. అందుచేత ఈ పనిమీద రాజధాని వెళ్ళాలి. అక్కడ పట్టుకోవలసిన వాళ్ళని పట్టుకోవాలి. చెప్పాల్సినవి చెప్పాలి. ముట్టజెప్పాల్సినవి ముట్టజెప్పాలి. మ రందుకు కొంత ఖర్చయినా వెనుదీయకూడదు. ఏమంటారు?" అంటూ ఆగి, అక్కడున్న అందరి వంకా చూశారు గోపాల్రావుగారు.

అందరూ ముఖ ముఖాలు చూసుకున్నారు.

"మావే రెండొందల కొంప లున్నాయి బాబయ్యా ! తలా ఓ పాతిక ఏసుకోమన్నా ఏసుకు నిస్తాం" అన్నా రొకరు ధైర్యం చేసి.

గోపాల్రావుగారు ఒక్క క్షణం ఆలోచించారు.

"అది చాలదు గానీ నే వెళ్ళి మాట్లాడేక ఎంత ఖర్చవుతుందో చెబుతాను. కానీ మీరు మాత్రం కొన్నిటికి కట్టుబడి ఓ మాట మీద నిలబడాలి. రేప్పొద్దున్న ఏ ఎన్నిక లొచ్చినా మనం కట్టుగా ఉండి మన క్కావల్సినవోడికే ఓట్లు వెయ్యాలి. మ రప్పుడు పేచీలు పెడితే కుదరదు."

"పేచీ లెందుకండీ. మీ రేవంటే అదే-మీ రెవరికంటే ఆరికే ఏస్తాం" అన్నారు కొందరు.

"సరే. ఆ విషయమై నే నీ రోజే ఫోనుకొట్టి మాట్లాడతాను."

గోపాల్రావుగారి మాట పూర్తి కాలేదు. అంతకు కొన్ని నిముషాల ముందే అక్కడి కొచ్చిన మునలయ్య లేచి ముందు కొచ్చి-"నా దే చిన్న మాట బాబూ" అన్నాడు.

"ఏఁవిటి చెప్పు."

"మరేల్లేదు బాబూ. మర్రిసెట్టుకీ ఉంది వయస్సు, నాకూ ఉంది. గేనం సేత మునలోణ్ణి కాకపోయినా నేను వయసుచేత మునలోణ్ణే. లోకం తెలీకపోయినా అనుబవం కూసింత మంచీ-చెడునీ ఏర్పడం నేర్పింది.

నా నొచ్చేదేటంటే... ఇవుడు మావోళ్ళు చెప్పిందాంట్లో కొంత యదార్థం లేకపోలేదు- ఊరంతా ఆకొనమున్నవుడు యీ మూలన దూరంగా యిసిరేసినట్టు వుండేది మా పేట. అప్పట్లో వూరికి దూరంగానూ మా కొంపలకి కాస్త దగ్గరగానూ వుండే దా సొసేనం. అయినా మా కిబ్బందిగా వుండేది కాదు. ఇవ్పుడంటారా వూరు పెరిగింది. కాళీస్తలాల్లో యిళ్ళు లేచాయి. పెద్దోళ్ళ పిల్లల కోసం కాన్మెంటొచ్చింది. దేవుడి గుడొచ్చింది. ఇవ్పు డీ సోశానం నిజంగానే వూరి మద్దె కొచ్చేసి నట్టయింది. మరిక్కడి పెజకి బీతాహం లేకుండా వుండడానికి దీన్ని ఆ కొండవారకి తరలించాలనుకుంటే తప్పేటుంది?"

మునలాడి మాటలకి ఆశ్చర్యంగా అతని వంక చూసేరు గోపాల్రావు గారు. ఆ చూపు మునలాడికి మరింత ధైర్యాన్నిచ్చింది.

"అవును బాబు మన హక్కులెవ్వరూ లాగేసుకోటంలేదే ! మన తాత ముత్తాతలిక్కడ బుగ్గయితే మనమూ యిక్కడే బుగ్గవాలనేటుంది? అయినా బాబూ ఊరి మద్దెన సోశాన ముండటం ఏం బాగు? అంచేత నేననే దేటంటే...మీరు గొప్ప పలుకుబడునోళ్ళు. మీరు మాబోటాళ్ళకి సెయ్యాల్సిన సాయం శానేటీ వుంది. మాఁవంతా ఒక తాటి మీదుంటే మిమ్మల్నడగటానికి చాలోటే వున్నాయి. ఆ మాట కొస్తే మా కుటుంబాలికి ఒళ్ళల్లో ఏదైనా వొస్తే చూపించుకోడానికి దగ్గర్లో అస్పత్రేది? మా పిల్లలు సదుంకోటానికి యిందంబట మంచి తెలుగు బడేది? ఆట్నీ గురించి అడిగితే సబబుగా వుంటాది. అంచేత మారాజా... ఆ కర్చు లేవో మేం బరాయిత్తాం. ఆట్నీ గురించి అడగండి. ఆట్నీ రప్పించండి. సచ్చేక ఎవుడెక్కడ తగలెడతారో ఎవుడు సూడొచ్చేడు?". అని ముగించేడు మునలయ్య.

ఆ క్షణంలో ముసిలోడు అభివృద్ధి నిరోధకుడిలా కనిపించాడు అక్కడ కూడిన అందరికీ.

"ముసిలో డన్నదాన్లోనూ నిజం లేకపోలేదు-మీరేమంటార్రా?" అని అడిగేరు గోపాల్రావుగారు.

"లేదయ్యా. పౌరుషం వుడిగిపోయిన ఆడి మాటల కేల్లండి. మాం పట్టుదలమీదున్నాం. ఈ రోజు సొసేనాన్ని మార్చేస్తారు. రేపు మా కొంపల్నే మార్చేస్తారు. అలా వూరుకుంటే ఎటన్నా సేస్తారు" అన్నా డొకడు లేచి-

"సరే. మీరే ఏదో తేల్చుకుని నాలుగు రోజుల్లో వచ్చి చెప్పండి. నేను చెప్పింది మాత్రం మర్చిపోకండి. ఆ రోజుకి కొంతన్నా ఎడ్వాన్సుగా ఇస్తే గాని పన్లు జరగవ్. ఆపైన మీ ఇష్టం" అంటూ లేచి లోపలికి నడిచేరు గోపాల్రావుగారు.

** ** **

గోపాల్రావుగారి ఇల్లంతా హడావుడిగా ఉంది. ముందు హాలంతా విజిటర్స్‌తో నిండిపోయి ఉంది. ఆ హడావుడికి కారణం గోపాల్రావుగారి ఏకైక పుత్రరత్నం రత్నాకరం మూడు వారాల లండన్ ట్రిప్ ముగించుకుని ఆ రోజు తిరిగొస్తున్నాడు. సాయంత్రం నాలుగున్నరకి ఫ్లైటు దిగిన రత్నాకరం ఇల్లు చేరేసరికి ఆరు గంటలయింది. అంతవరకూ అతనికోసం ఎదురు చూస్తున్న వారంతా ఒక్కమారు అతన్ని చుట్టుముట్టి పూలమాలలతో ముంచెత్తారు.

ఆ క్షణంలో గోపాల్రావుగారి కళ్ళు ఆనందబాష్పాల్ని రాల్చేయి. కొడుకు ప్రయోజకుడైనందుకు ఆయన గుండె ఆనందంతో నిండిపోయింది. రత్నాకరం అభివృద్ధికి వెనుక ఉన్న తన కృషికి ఒకింత గర్వం కూడా కలిగింది. ఆ సమయంలో ఆయనకు 'పుత్రోత్సాహము తండ్రికి..." అనే పద్యం గుర్తుకొచ్చింది. పదేళ్ళ క్రితం పసుపు కుంకుమలతో తనదారి వెతుక్కున్న భార్య గుర్తుకొచ్చింది.

అతని మనసు ఆందోళనకు గురైంది ఒక్క క్షణం. అయినా అది కనిపించనీకుండా హడావుడిగా తన పనిలో లీనమైపోయారు.

ఇంత జరుగుతున్నా అక్కడి ఆ ఆనందాన్ని పంచుకోడానికి రత్నాకరం భార్య శ్యామల మాత్రం ఆ సమయంలో అక్కడ లేదు. సరిగ్గా అదే

# వ్యాయామం క్రీడలు



శ్రీ సి.కె.నాయుడు తమ్ముడు శ్రీ సి.యస్.నాయుడు కూడా క్రికెట్ క్రీడలో అంతర్జాతీయ కీర్తిని ఆర్జించారు. వీరి జననం 19 ఏప్రియల్, 1914. 1933 భారతదేశంలో పర్యటించిన బ్రిటిష్ జట్టుతో జరిగిన టెస్ట్ పోటీలలో మొట్టమొదటిసారిగా పాల్గొన్నారు. ఫీల్డింగ్‌లో వీరు దిట్ట. 1936, 45, 46, 47, 49, 50, 51 సంవత్సరాలు భారతదేశం పాల్గొన్న క్రికెట్ పోటీలలో భారత జట్టు సభ్యులు. రంజీ ట్రోఫీ పోటీలలో బరోడా, హోల్కార్, పూర్వాంధ్ర జట్లకు ప్రాతినిధ్యం వహించారు. 1953 రంజీ ట్రోఫీ పోటీల్లో పాల్గొన్న పూర్వాంధ్ర జట్టు ఉపనాయకులు 1955, 59 ఆంధ్ర జట్టుకు నాయకత్వం వహించారు. ప్రస్తుతం ఇండోర్‌లో కులాసాగా కాలక్షేపం చేస్తున్నారు.

ఏకా

## అంగార రాగం

ఈ రాత్రి
అశ్రుత గాంధర్వానికి
ప్రాణ ప్రతిష్ఠ జరుగుతోంది
నీరవ పారావారంలో
నిదుర లేచిన నాద తరంగం-
తపస్సమాధిలోని గుండె
తలుపు తట్టి
నరాల రక్తానికి
నర్తన నేర్పుతోంది
హృదయ స్పందనల మృదంగ ధ్వనులకు
మృదులయ విన్యాసం కూర్చుతోంది
ఆకారం లేని ఓ భావన
అపురూపమైన ఓ కామన
అంతర్లోకాలలో ఊపిరి పోసుకుని
అనంత జీవవేదనల్ని కలబోసుకుని
ప్రాణవీణా నిక్వాణాలలో
గానధునిగా ప్రవహిస్తున్నాయి.
ఓ సుమూహూర్తంలో
ఈ స్తబ్ధ నిశ్శబ్దమయమైన
గళం గట్లు తెగి
ప్రచలిత రసనాగ్రంపై ఒదిగి
అమృత ధారాపాతంగా
అతి వేలంగా దూకిన
వైతాళిక గీతాన్ని
పవనవిహంగం పక్షాల కెత్తుకుని
ప్రాచీముఖంగా దూసుకు పోతుంది!
వివృత గవాక్షాల ముంగిట
సిందూర రంగవల్లికల నందిట
అంగార రాగ మాలికలు
శృంగారించి వస్తుంది!

చైతన్య ప్రసాద్

గుంపులుగా చేరి ఉన్నాయి.

మలుపు తిరిగి, నాలుగడుగులు వేసి అక్కడ ఆగిపోయింది నిర్మల-మనసులో ఏదో భయం ! భయాన్ని మించిన ఆత్రత !

ఏం జరుగుతూం దక్కడ? ఏం జరుగుతోంది? బాగా పాడుబడిపోయి అక్కడక్కడ కూలిపోయి ఉన్న ఆ గోడ పక్కగా నడిచి లోపలికి తొంగి చూసింది-

దూరంగా తులసికోట. ఆ వెనుక ఏదో పొగ ! రోజూ కార్లో వస్తూ చూస్తుంది. కానీ ఏమీ కనిపించదు. ఓ రోజు ఓ శవాన్ని ఎవరో గుంపుగా లోపలికి తీసుకువెళ్తూంటే చూసింది. డ్రైవర్ని అడిగితే 'ఎవరో చచ్చిపోయారు' అన్నాడు. ఏం చేస్తా రతన్ని అని అడిగితే 'అవన్నీ మీ కెందు కమ్మాయిగారూ' అన్నాడే తప్ప చెప్పలేదు. ఆ తరువాత ఓ రోజు విస్సీ చెప్పాడు. శ్మశానంలో కాల్చెయ్యడమో, పాతెయ్యడమో చేస్తారని.

అయితే ఇప్పు డీ పొగ...అదేనా? ఎవర్నో కాల్చేశారా? వర్షం మొస్తోందని అంతా వెళ్ళిపోయారా? ఆ తరువాత ఏం జరుగుతుందీ? ఏ దయ్యమో...పిశాచమో అయి తనను పట్టుకుంటే...?

ఎక్కడో గజ్జికుక్క వికారంగా అరిచిన అరుపు వినిపించింది నిర్మలకు. ఆ వెంటనే తన గౌను నెవరో లాగినట్టయింది.

అంతే !

భయంతో నిలువెల్లా వణికిపోయింది నిర్మల. వెనుదిరిగి చూసే ధైర్యం లేకపోయింది. ఆమె కనురెప్పలు మూత పడిపోయాయి !

** ** **

డాక్టర్ కళ్ళలోకి ఆత్రంగా చూశారు ముగ్గురూ.

"నౌ షి ఈజ్ ఆల్‌రైట్. వెంటనే చూశారు కాబట్టి సరిపోయింది. లేకపోతే ఏమయ్యేదో?" అన్నాడు డాక్టర్.

ముగ్గురి కళ్ళలోనూ నీళ్ళు.

"అమ్మా నిర్మలా !" కూతురి తల నిమురుతూ నెమ్మదిగా పిలిచింది శ్యామల.

నెమ్మదిగా రెప్పలు కదిల్చి విప్పి చూసింది నిర్మల.

"నే నిక్కడికి ఎలా వచ్చాను మమ్మీ?" అడిగింది నెమ్మదిగా.

"నేనూ, తాతయ్యా నిన్ను మన కార్లో తెచ్చామమ్మా."

నిర్మల డాడీ వంక చూసింది.

"తాతయ్య మంచివాడు కాదు డాడీ ! నా కోసం కారు పంపలేదుగా... అందుకే నేను..."

"అవునమ్మా ఈ తాతయ్య మంచివాడు కాదు. పరమ పాపాత్ముడు !" గోపాల్రావుగారి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"అదేంటి నాన్నా మీరూను ! చిన్నపిల్ల...అదేదో అంటే..." అన్నాడు రత్నాకరం.

"తాతయ్య కారు పంపేరమ్మా. కానీ కాస్త లేటయింది. డాడీ వచ్చేరుగా ఈ రోజు. అప్పటికే ను వ్వెళ్ళిపోయావని తిరిగొచ్చాడు డ్రైవరు. పాపం, తాతయ్య నీకోసం ఎంత బెంగెట్టుకున్నారో ! ఏదీ మరి తాతయ్య కో ముద్దియ్యి" అంది శ్యామల కల్పించుకుని.

నిర్మల తాతయ్య వంక చూసింది-గోపాల్రావుగారు నిర్మల దగ్గర కూర్చుని ఆమె తల నిమిరాడు.

ఆయన ముఖాన్ని రెండు చేతుల్లోకి తీసుకుని ఆయన బుగ్గమీద ముద్దు పెట్టింది నిర్మల.

** ** **

ఆ మర్నాడు ఉదయం ఇంటిముందు గార్డెన్‌లో తాతయ్య ఒడిలో తల పెట్టుకుని గారాలు పోతూ "మరీ...మరీ... నేను చచ్చిపోయా ననుకున్నారా మీరంతా?" అని అడుగుతోంది నిర్మల.

"ఛ-లేదమ్మా-అలా ఎప్పుడూ అనకూడదు-మరి నువ్వు ఇంటికి రాకపోయేసరికి ఎన్నిచోట్ల వెతికామో తెలుసా? చివరికి ఆ ముష్టిది చెప్పకపోతే మేం నిన్ను చూసేవాళ్ళమే కాదు తల్లీ !"

"ఏ ముష్టిది తాతయ్యా, ఆ పిల్లికళ్ళ పిచ్చిదేనా?"

"అవునమ్మా. అది పిచ్చిది కాదు. పాపం బీదది. అంతే ! నువ్వు పడిపోవడం చూసి పరుగెత్తుకొస్తూ మన కారుకింద పడబోయింది. సడెన్‌బ్రేకు వెయ్యకపోతే ఏమైపోయేదో పాపం ! తీరా చూస్తే రోడ్డు పక్కన ముళ్ళతుప్పల్లో నువ్వు కనిపించావు. ముళ్ళకంచెకి గౌను పట్టుకుంటే ఎవరో లాగే రనుకుని నువ్వు భయపడ్డావు. దీని కంతటికీ కారణం నేనే నమ్మా !" అన్నారు గోపాల్రావుగారు.

"పాపం...అయితే ఆ పిచ్చిది...కాదు కాదు బీదది మంచిదే తాతయ్యా ! చిన్నపిల్లల్ని భయపెట్టే ఆ శ్మశానమే మంచిది కాదు. అయినా ఊరి మధ్యలో అలా శవాల్ని కాలుస్తుంటే చిన్నపిల్లలు చూసి భయపడరేంటి తాతయ్యా. మీరే గనక చూడకపోతే నేనూ చచ్చిపోయేదాన్నిగా?"

అమాయకంగా ప్రశ్నిస్తూన్న నిర్మల మాటలకు అచేతనంగా ఉండిపోయారు గోపాల్రావుగారు.

కులమతాలకూ, రాజకీయాలకూ అతీతంగా అమాయకమైన ఆ చిన్నారి ప్రశ్న ఆయనలో ఎక్కడో దాగి ఉన్న మానవత్వాన్ని తట్టి లేపినట్టయింది. డబ్బుకీ, పలుకుబడికీ, హోదాకీ లొంగిపోయి మానవ శ్రేయస్సునే విడనాడే తనలోని రాక్షసత్వాన్ని సవాలు చేసినట్టయింది.

ఈ రోజు ఈ చిన్నారికి ఇలా జరిగింది. మరి రేపు? ఆ చుట్టూ నిరంతరం తిరుగాడే ఎందరో చిన్నారులు... వాళ్ళ మాటేమిటి?

నిర్మల అడిగిన ప్రశ్నే ఎన్నో రకాలుగా మారి వినిపించసాగింది.

చదువు సంధ్యలు లేకపోయినా లోకాన్ని చదివి వృద్ధుడైన ముసలాడిలోనూ; లోకం తెలీని అమాయకపు నిర్మలలోనూ ఉన్న ఆలోచనాశక్తి తనలో ఎందుకు కొరవడిందో అర్థం కాలే దాయనకు.

అర్థమైన మరుక్షణంలో అతనిలో కొత్త మనిషి పుట్టాడు.

మానవ కళేబరాలు దగ్ధమైన ఆ ఊర్ మధ్య స్థలంలో పసిపిల్లల నవ్వుల్లాంటి పువ్వుల్ని వికసింపజేయాలి ! అక్కడ మొక్కల్ని పెంచాలి ! అందుకు అవసరమైతే తనకున్న పలుకుబడినీ, డబ్బునీ కూడా వెచ్చించాలి' అనుకున్నారు గోపాల్రావుగారు. అనుకున్న విషయాన్నే మనుమరాలితో చెప్పారు.

"మా తాతయ్య మంచి తాతయ్య !" అంటూ నిర్మల ముద్దు పెడుతూంటే రోజూ చూసే ఆ తోటే ఎంతో అందంగా కనిపించిం దాయనకు ఆ క్షణాన.

## కొలంకథలు

### సాక్ష్యం

అది ఆ పట్నంలోని లాడ్జీలలో కెల్లా ఆధునికమైనది. పేరు రాయల్ లాడ్జి ఆ లాడ్జిలో బస చేసే వారి సంఖ్య ఎక్కువ కావడం వల్ల ఎప్పుడూ రష్‌గానే ఉంటుంది.

కౌంటర్ దగ్గరకు ఇద్దరు యువతీ యువకులు వచ్చి "మేము ఈ రాత్రి గడిపేందుకు లాడ్జి కావాలి" అని అడిగారు.

కౌంటర్‌లో కూర్చున్న వ్యక్తి "పెళ్ళి కాకుండా వచ్చే వారికి మా లాడ్జిలో రూమ్ ఇవ్వము. మాకు అనవసరంగా చెడ్డ పేరు వస్తుంది. అదీగాక అప్పుడప్పుడు పోలీసులు రైడ్ చేస్తుంటారు. ఇప్పుడు చెప్పండి. మీకు పెళ్ళయిందా?" అని అడిగాడు.

"అయింది" అన్నారు ఇద్దరూ ఒకేసారి.

"సంతోషం! మీ వివాహం అయిందన్న విషయం తెలిపే సాక్ష్యం ఏమైనా ఉందా?" అడిగాడు కౌంటర్‌లో వ్యక్తి.

"ఉందండీ! మా పెళ్ళి నాటి ఫోటోలు చూపమంటారా?" ఇద్దరూ మళ్ళీ ఒకేసారి జవాబిచ్చారు.

"మరింకేం? చూపించండి" అన్నాడు కౌంటర్‌లో వ్యక్తి?

ఆ యువకుడు ఒక ఫోటో తీసి చూపించి "ఇదిగోండి? ఈ ఫోటో నేనూ మా ఆవిడా కలిసి తీయించుకున్నది" అన్నాడు తనూ, తన భార్యా ఉన్న ఫోటో చూపుతూ.

ఆ యువతి కూడా మరో ఫోటో తీసి చూపిస్తూ "ఇదిగోండి ఇది చూడండి ఇందులో మా ఆయనా, నేనూ ఉన్నాం" అంది తన భర్తతో దిగిన ఫోటో చూపుతూ.

కౌంటర్‌లో వ్యక్తి ఆశ్చర్యంతో నోరు తెరిచాడు

ఎన్. ఉమామహేశ్వరరావు

### ట్రాజెడి

"మంచి ట్రాజెడీ కథ చెప్పు గురో?" అంటూ వచ్చి కూచున్నాడు సుబ్బారావు.

సుబ్రహ్మణ్యం చెప్పడం ప్రారంభించాడు. "కుటుంబరావుగారి పెద్దమ్మాయి క్రిస్టియన్‌తో లేచిపోయింది. పీటల మీది పెళ్ళి చెడిపోయిందని రెండో అమ్మాయి ఉరేసుకుంది. ఇది చూసి కుటుంబరావుగారి భార్యకి గుండాగిపోయింది. అప్పులాళ్ళు పీక్కు తింటున్నారు. ఇంటికి వేలం నోటీసు వచ్చింది. చిన్నాడూ, చంటాడూ ఆకలంటూ ఏడుస్తున్నారు. పాలవాడూ పోయ నన్నాడు. కరెండు వాళ్ళు కరెండు పీకేశారు."

"తరువాత?" అన్నాడు సుబ్బారావు కళ్ళు తుడుచుకుంటూ

"జీవితం మీద విరక్తిపుట్టి కుటుంబరావుగారు శూన్యంలోకి చూస్తూ, అలా నడుస్తూ ఊరవతల బావి దగ్గరకు చేరుకున్నారు. దేవుడికి దండంపెట్టి బావిలోకి దూకేశారు" అని ఆగేడు సుబ్రహ్మణ్యం।

"చాలు గురో ఇంక చెప్పకు" అన్నాడు సుబ్బారావు భోరున ఏడుస్తూ.

"విను మరి। అసలు ట్రాజెడీ ముందుంది. ఆ బావిలో నీళ్ళు లేవు."

ఏ. సరిత